క్లుప్తంగా

కంటివైద్య శిబిరానికి స్పందన



కంటి శస్త్ర చికిత్స చేసిన వారితో నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అవసరమైన వారికి ఉచితంగా కేటరాక్ట్ చికిత్సలు చేశారు. జనరల్ వైద్య నిపుణులు రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. జనసేన నాయకుడు ధర్మేంద్ర సహకారంతో శిబిరం నిర్వహించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథ శవానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తి ఎన్ఏడీ బ్రిడ్జి కింద చనిపోయాడు. అతనికి కుటుంబ సభ్యులు ఎవరూ లేరని ఎయిర్ పోర్ట్ పోలీసులు నిర్ధారించారు. ఆ శవానికి అంత్యక్రియలు నిర్వహించాలని మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన మమత జ్ఞానాపురం శ్మశాన వాటికలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత వామనమూర్తి

సీతమ్మధార: ఆటో డ్రైవర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేసే 21, 31 జీవోలు రద్దు చేస్తామని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేల అమలు చేస్తూ పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా.. ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వినతి

మహారాణిపేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు కోరారు. సోమవారం పలు సమస్యలపై కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనేక మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బందులకు గురవడంతోపాటు డ్రాప్‌ఔట్స్ అవుతున్నారని నాగరాజు తెలిపారు. రూ.4,800 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో ఈ నిధులు విడుదల చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. దీని వల్ల కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజ్ కట్టాలని విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేసి ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జె.అభిషేక్, ఎ.పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

ఆకతాయిల అడ్డా

నిత్యం దరఖాస్తుదారులతో కళకళలాడిన మీ సేవా కేంద్రం నేడు శిథిలావస్థకు చేరింది. ప్రజా అవసరాల కోసం లక్షల వ్యయంతో నిర్మించిన భవనం పాడుబడిన బంగ్లాగా మారింది. దీంతో ఆకతాయిలు దీనిని అడ్డాగా చేసుకుని, అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మార్చేశారు. ఈ భవనాన్నే ఆనుకుని ఉన్న ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికీ ఆకతాయిల బెడద తప్పడం లేదు.

శిథిలావస్థకు చేరిన మీ సేవా కేంద్రం భవనం



శిథిలావస్థలో ఉన్న కేంద్రం ఆవరణ



గుల్లలపాలెం ఎంఐజీ కాలనీ ఆవరణలోని మీ సేవా కేంద్రం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- పక్కనే ఉన్న ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి తప్పని బెడద

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ ఆవరణలో సుమారు 80 సెంట్ల విస్తీర్ణంలో రూ.23 లక్షలతో అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన భవనంలో మీసేవా కేంద్రాన్ని 2003వ సంవత్సరంలో ప్రారంభించారు. జనన, మరణ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు కరెంటు బిల్లులు, ఆస్తిపన్నులు, క్రికెట్, సినిమా టికెట్లు ఆన్‌లైన్ సేవల ద్వారా అందించేవారు. అయితే మీ సేవా కేంద్రాలు కనుమరుగు కావడంతో ఈ భవనం ఆలనాపాలనా చూసే నాథుడు కరువయ్యారు. ఈ కేంద్రంలోని విలువైన ఫర్నిచర్‌తో పాటు ఏసీలు, ఫ్యాన్లు, కంప్యూటర్లు మాయం అయ్యాయి. భవనం నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. దీంతో కొందరు ఆకతాయిలు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా భవనం ఆవరణలోకి చేరి మద్యం, గంజాయి సేవనంతో పాటు ధూమపానం చేస్తున్నారు. ఆ మత్తులోనే భవనం పరిసరాల్లో సంచరించడంతో పాటు పక్కనే ఉన్న ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ఆవరణలోకి చేరుతున్నారు. ఆస్పత్రి రక్షణ గోడ ఎక్కి కేకలు వేయడం, ఆస్పత్రికి వచ్చే రోగులతో అసభ్యకరంగా మాట్లాడటం వంటివి చేస్తున్నారు. వీరి ఆగడాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడికి పాల్పడుతున్నారు.

మరోవైపు ఆకతాయిల చేష్టతో ఆ భవనాన్ని ఆనుకుని ఉన్న నివాసితులు, అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసుల గస్తీ సరిగ్గా లేకపోవడంతో వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, భవనాన్ని బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. అలాగే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా పెట్టి, వారితో కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.





మద్యం బాటిల్స్ సేకరిస్తున్న వ్యక్తులు, ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ఆవరణలోని చెట్టు తొర్రలో బీరు సీసా

గట్టి నిఘా పెట్టాలి



పారిశ్రామిక ప్రాంత ప్రజలకు ఎన్నో సేవలను అందించిన మీ సేవా కేంద్రం నేడు శిథిలావస్థకు చేరుకోవడం చాలా బాధగా ఉంది. ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాన్ని మరల ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలి. ఆకతాయిలకు చెక్ పెట్టాలి.

– మజ్జి రమేష్‌పాత్రుడు, స్థానికుడు

ఆకతాయిల బెడద ఎక్కువైంది



మీ సేవా కేంద్రం పాయింట్ వద్దకు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఆకతాయిలు వచ్చి ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారు. వీరి చేష్టల వల్ల పక్కనే ఉన్న ఆస్పత్రికి వచ్చే రోగులు భయపడుతున్నారు. భవనాన్ని బాగు చేయిస్తే, ఆకతాయిల సమస్య నుంచి కాపాడినవారవుతారు. పోలీసులు గట్టి నిఘా పెట్టాలి.

– రమణ, స్థానికుడు

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

విశాఖ విద్య: విద్యార్థులు స్నేహ భావంతో మెలిగి చదువుల్లో రాణించాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు అన్నారు. సాంఖ్యాక శాస్త్ర విభాగం ఓరియంటేషన్ ప్రోగ్రాంను సోమవారం ఏయూ టీఎల్ ఎన్ హాల్లో సోమవారం నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ మునిస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు పరస్పర స్నేహభావంతో మెలగాలని సూచించారు. చెడు మార్గంలో పడకుండా మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించేలా కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రముఖులను స్ఫూర్తిగా తీసుకుంటూ జీవితంలో ఎదగాలని సూచించారు. బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర ఆటల పోటీల విజేతలను మెడల్స్‌తో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె. నిరూపమ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించే వరకు పోరాడాలి

మల్కాపురం: జీవించడం అంటే కేవలం ప్రాణంతో ఉండడమే కాదు.., ఆత్మగౌరవంతో జీవించడం అని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ప్రసంగించారు. వ్యక్తిత్వ వికాసానికి, సమాజ ప్రగతికి, ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి హక్కులు ఎంతో అవసమరమన్నారు. దోపిడీ నుంచి విముక్తి పొందడానికి,దురాచారాలను నిర్మూలించడానికి మానవ హక్కులపై అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం అని వివరించారు. సీనియర్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అనసూయాదేవి

సామాజిక పింఛన్లపై ప్రత్యేక బృందం సర్వే

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ–2 ప్రాంతంలోని 1086337 సచివాలయ పరిధిలో సామాజిక పింఛన్లను ప్రత్యేక బృందం సోమవారం తనిఖీ చేసింది. ముందుగా ఈ వెరిఫికేషన్ టీమ్ సచివాలయానికి వచ్చి ఆ పరిధిలో ఎంతమంది సామాజిక పింఛన్లు తీసుకుంటున్నారనే వివరాలను అధికారుల నుంచి సేకరించారు. ఆ జాబితా ఆధారంగా కొందరు పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పరిశీలన చేశారు. పింఛన్లు తీసుకుంటున్న వారికి అర్హత ఉందా, లేదా అన్నదానిపై బృందం సర్వే చేసింది. అనంతరం ఇందిరాకాలనీ పరిధి గౌరీదేవి ఆలయం వద్ద కొంతమంది పింఛన్‌దారులతో సర్వేకు వచ్చిన స్పెషల్ టీమ్ ముచ్చటించినట్టు సమాచారం. ప్రత్యేక సర్వే టీమ్ రావడంతో కొంతమంది పింఛన్‌దారుల్లో ఆందోళన నెలకొంది. ఏ వంకతో తమను తొలగిస్తారో అనే కలవరం వారిలో మొదలైంది. ఇదిలా ఉండగా సర్వేలో ఎంతమంది అనర్హులను గుర్తించారనే సమాచారం చెప్పేందుకు అధికారులు నిరాకరించారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు





విశేష పూజలో కనక మహాలక్ష్మి అమ్మవారు, అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 8వ రోజు సోమవారం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అనంతరం సర్వ దర్శనం కల్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు మార్గశిర గురువారాల్లో రూ.7,500, మిగిలిన రోజుల్లో రూ.2,500 చెల్లించాలని ఈవో శోభారాణి తెలిపారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు

సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్ర నవావరణార్చన, లక్ష్మీ హోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చన, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చన చేశారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదపారాయణ, మహా విద్యాపారాయణ జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'లో భాగస్వాములు కావాలి

విశాఖ విద్య: వికసిత్ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ జి.శశిభూషణరావు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గవర్నర్ కార్యాలయం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో వీసీతో కూడిన ఏయూ అధికారుల బృందం పాల్గొంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల ప్రధాన ఉద్దేశం, నిర్వహణ తదితర అంశాలను రాజ్ భవన్ అధికారులు వివరించారు. ముందుగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, అర్హత సాధించిన వారిని వ్యాసరచన పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వ్యాసరచన పోటీలకు 10 అంశాలను ఇచ్చినట్లు చెప్పారు. వీరిలో విశ్వవిద్యాలయాల వారీగా విద్యార్థులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపాలని సూచించారు. ఈ పోటీల నిర్వహణ, విధి విధానాలు తదితర అంశాలను వర్చువల్ సమావేశంలో వివరించారు. పోటీల ప్రత్యేక నియమావళి, సూచనలు అనుసరిస్తూ ఎంపిక ప్రక్రియ జరపాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల వ్యాసాలను పరిశీలించి, ఎంపిక చేసే విధానం, నిపుణుల ఎంపిక తదితర అంశాలను వివరించారు. సమావేశంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు, ఆచార్య అన్నపూర్ణ, ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య ఎ.నాగ హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఏయూ వీసీ శశిభూషణరావు, అధికారులు

గోపాలపట్నంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభం

సామాజిక పింఛన్లు, ఇళ్ల పట్టాలకు అత్యధిక దరఖాస్తులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలంలో రెవెన్యూ సదస్సులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో తొలి రోజు సదస్సు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, ప్రజానీకం మాత్రం తమకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు.

వినతులు ఇవీ..

ఇందిరా ప్రియదర్శిని కాలనీలో ఉంటున్న తమకు అర్హత ఉన్నా 2019లో చంద్రన్న పట్టాల పంపిణీలో తమకు మంజూరు చేయలేదని 20 మంది నివాసితులు అర్జీలు అందించారు. అదేవిధంగా ఏపీఎస్ ఈబీ కాలనీ, కాకాని నగర్, వినోద్ నగర్, విమాన్‌నగర్ భూ యజమానులు సదస్సులకు హాజరై దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందజేశారు. మొత్తం 70 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ చావలి వెంకట రమేష్ వెల్లడించారు. వీటిలో కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని 17, ఇళ్ల పట్టాల కోసం 25 దరఖాస్తులు అందాయి. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి వేదికగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, రెవెన్యూ సదస్సు స్పెషల్ ఆఫీసర్, స్టీల్ ప్లాంట్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీత, గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ డి.ఎస్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాయి, ఆర్ఐ కోమలి, సర్వేయర్లు రాజ్ గోపాల్, లీలా, వీఆర్వో సుబ్రహ్మణ్యం, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శేఖర్ బాబు, 90 వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ,మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, రెవెన్యూ కార్యదర్శులు, సచివాలయ రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్, ఎమ్మెల్యే గణబాబు

మహానగరంలో.. మట్టిరోడ్లు!

ఫోకస్

అవును..! మీరు చూస్తున్నది నిజమే..

మహానగరం ఒక వైపు విస్తరిస్తుంటే... మరో వైపు కొన్ని ప్రాంతాల్లో సౌకర్యాలు పల్లెల కన్నా ఘోరంగా ఉన్నాయి. నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. కొన్ని మార్గాలు ఛిద్రమయ్యాయి. ప్రధానంగా జీవీఎంసీ 89, 91, 92 వార్డుల పరిధిలో పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వెంకటాపురం నుంచి శ్మశానవాటికకు వెళ్లే మార్గంతో పాటు కొత్తపాలెం వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. ఇక్కడి రైల్వే బ్రిడ్జి(5 మదాల వద్ద) బురద మయంగా మారింది. వర్షం పడితే చాలు ఈ రోడ్డులో నడిచి వెళ్లేందుకు కూడా వీల్లేని విధంగా తయారవుతోందని వాపోతున్నారు. పాలకులు స్పందించి రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

– గోపాలపట్నం



మట్టి రోడ్డును తలపిస్తున్న వెంకటాపురం రహదారి



రైల్వే అండర్‌వే వద్ద అధ్వానంగా రహదారి



వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డు దుస్థితి

ఫార్మసీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

విశాఖ విద్య: డాక్టర్ దేవా హెచ్.పురాణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్, భాగస్వామి–మేనేజింగ్ డైరెక్టర్, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కన్సల్టింగ్ ఫర్మ్, పీ–ఏ, యూఎస్ఏ–యూకే సహకారంతో ఏయూ ఫార్మసీ కళాశాల కొత్త భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్ పురాణం ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. డాక్టర్ దేవా హెచ్.పురాణం ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన తాజా పరికరాలను, పునర్నిర్మించి ఆధునికీకరించి గదులను రిజిస్ట్రార్‌కు చూపించారు. ల్యాబ్ స్థాపన, ఏర్పాటు ఉద్దేశాన్ని వివరించారు. పరిశ్రమ–అకాడమియా సంబంధం ప్రాముఖ్యతపై ముఖ్యంగా ప్రస్తావించారు. డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ కె.ఈశ్వరకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్, ప్రొఫెసర్ కె.బసవయ్య, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు విడిచి ప్రజా రవాణాను వినియోగించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, నగర ప్రజలు సహకరించి బస్సులు, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చన్నారు.



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి